ముందస్తు దీపావళి వేడుకలు



పారమితలో టపాకాయలు కాల్చుతున్న విద్యార్థులు



అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కరీంనగర్/కొత్తపల్లి: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల పారమిత ఉన్నత పాఠశాల, వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు దీపావళి పండుగ ప్రాముఖ్యతను నాటక, కథల రూపంలో కళ్లకు కట్టినట్లు వివరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పారమిత పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, ఎస్‌వోడీ తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని భగవతి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఆహుతులను అలరించాయి. చిన్నారి విద్యార్థులు రంగురంగుల దుస్తులు, దేవతల, మహనీయుల, మహోన్నత వ్యక్తుల వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. వేడుకల్లో భగవతి విద్యాసంస్థల అధినేత బి.రమణారావు, కరస్పాండెంట్ బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: సబ్‌స్టేషన్‌లలో నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా కరీంనగర్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు 33/11కేవీ అంబేద్కర్‌నగర్, టవర్‌సర్కిల్, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఉజ్వలపార్కు, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల, సప్తగిరికాలనీ, పద్మనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1, 2 ఏడీఈలు ఎస్.నరేందర్, ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

కవి ఖాలీద్‌కు మంత్రి అభినందన



ఖాలీద్‌ను అభినందిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కల్చరల్: నగరానికి చెందిన ఆటోడ్రైవర్, కవి ఎండీ.ఖాలీద్‌ను శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఖాలీద్ రచించి ఆవిష్కరించిన మనమంతా ఒక్కటే పుస్తకాన్ని మంత్రికి అందజేశారు. సమాజాభ్యుదయ పరమైన ఇలాంటి కవితలతో కూడిన పుస్తకాలు మరిన్ని రచించాలని మంత్రి ఆకాంక్షించారు. ఓ ఆటోడ్రైవర్‌గా ఉంటూ విభిన్న అంశాలు, సామాజిక సమస్యలపై స్పందిస్తూ కవిత్వం రాస్తున్న ఖాలీద్ గొప్ప కవిగా రాణించాలని అన్నారు.

వైఎస్సార్‌టీపీకి ‘వరాల’ రాజీనామా

కరీంనగర్‌రూరల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీకి షర్మిల మద్దతు ప్రకటించినందుకు నిరసనగా వైఎస్సార్‌టీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వరాల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలకు లేఖను పంపించానని అన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్‌పై తగిన నిర్ణయం తీసుకుని ప్రకటిస్తానని తెలిపారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి పరామర్శ



బియ్యం అందజేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను నగరంలోని ఆటో అడ్డాల నాయకులు శుక్రవారం పరామర్శించారు. వన్నారంకు చెందిన కోడూరి మల్లేశం, గజ్జల గణేశ్‌ల కుటుంబాలకు ఒక్కొక్కరికీ 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ఉపాధ్యక్షుడు పోతు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు కొత్తూరు సత్యనారాయణ, వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్, వన్నారం ఆటోస్టాండ్ అధ్యక్షుడు గుర్తురి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గజ్జల సురేష్, తాటి జనార్దన్, రాచూరి నర్సింగం, శ్యామల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం



కరీంనగర్ సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రధానాచర్యులు, లయన్ జిల్లా అదనపు కార్యదర్శి కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేశారు. కవి, రచయిత, కాలమిస్ట్‌గా పేరొందిన మధుసూదన్‌రెడ్డి తన విశ్రాంత జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారని పేర్కొంటూ పలువురు మిత్రులు సన్మానించారు. కార్యక్రమంలో రావికంటి కృష్ణ కిశోర్, మహేందర్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణరావు, కోట సత్యం, కిషన్, దాసరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేస్తాం

- ప్రలోభాలకు లొంగం
- కొత్తతరానికి బాటలు వేస్తాం
- ‘సాక్షి’తో నూతనంగా ఓటు హక్కు పొందిన విద్యార్థులు



కరీంనగర్ సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న స్థానం అమూల్యమైంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుని తొలిసారి వినియోగించుకోవడం అనుభూతిని ఇస్తోందని పలువురు కళాశాలల విద్యార్థులు తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కుని వినియోగించుకుంటామని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు గొప్ప ఆయుధమని ఐదేళ్ల భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆలోచన లేకుండా ఓటు హక్కును దుర్వినియోగం చేస్తే ఐదేళ్ల పాటు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈనెల 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల సందర్భంగా కొత్తగా ఓటు హక్కు పొందిన నగరంలోని పలు కళాశాలల విద్యార్థులను ‘సాక్షి’ పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకొని కొత్తతరానికి బాటలు వేస్తామని తెలిపారు.

ప్రలోభాలకు లొంగొద్దు



ఓటును ప్రజల నుంచి నాయకులు కొనే పద్ధతికి స్వస్తి పలకాలి. ఓటు హక్కును అమ్ముకోవద్దు. తమ బాధ్యతగా వినియోగించుకోవాలి. నిజాయితీతో అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలి. ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులకు బాధ్యులవుతారు.

– ఎస్ సాయిలిఖిత, బీకాం ఫైనల్ ఇయర్, మహిళా డిగ్రీ కళాశాల

ఓటు వజ్రాయుధం



ఓటు వజ్రాయుధం లాంటింది. సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే గొప్ప అవకాశాన్ని భారత రాజ్యాంగం కల్పించింది. ఓటు వేయడం బాధ్యతగా భావించాలి. మంచి భవిష్యత్ కోసం సరైన వ్యక్తిని ఎన్నుకోవాలి. ఓటును దుర్వినియోగం చేస్తే వచ్చే ఐదేళ్ల పాటు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– ఏ.అంజలి, బీకాం ఫైనల్ ఇయర్, మహిళా డిగ్రీ కాలేజీ, కరీంనగర్

అభివృద్ధికి బాటలు వేయాలి



ఓటు హక్కు వినియోగంపై ఇటీవల మా కళాశాలలో కలెక్టర్ పమేలా సత్పతి అవగాహన కల్పించారు. స్ఫూర్తిగా తీసుకొని ఓటు వినియోగించుకోవడంతో పాటు చుట్టుపక్కల వారికి ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకోవాలి. మంచి నాయకుడిని ఎన్నుకొని అభివృద్ధికి బాటలు వేయాలి.

– పి.పల్లవి, బీఎస్సీ సెకండియర్, ఎస్సారార్ కాలేజీ

ఓటుహక్కు విలువైంది



రాజ్యాంగం ప్రజలకు అందించిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు అత్యంత విలువైంది. ప్రజలు సరైన విధంగా ఓటు హక్కును వినియోగించుకొని సమర్థుడైన వ్యక్తిని ఎన్నుకోవాలి.

– ఏ.శివప్రసాద్, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం, ఎస్ఆర్ఆర్ కాలేజీ

మంచి నాయకున్ని ఎన్నుకోవాలి



ఓటు ప్రజల హక్కుతో పాటు గొప్ప బాధ్యత. సక్రమంగా వినియోగించుకొని మంచితరానికి బాటలు వేయొచ్చు. మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు అవకాశంగా భావించి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలి. – జి.అంకిత, బీఎస్సీ, ద్వితీయ సంవత్సరం, ఎస్ఆర్ఆర్ కాలేజీ

చిత్ర కథ వంతెన మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం



కరీంనగర్ మండలం ఇరుకుల్ల శివారులోని ఎస్సారెస్పీ డీ89 ప్రధాన కాలువపై ఉన్న వంతెన మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మూడు నెలల క్రితం వంతెన పైపులైన్‌లో చెత్త చెదారం తట్టుకోవడంతో సమీపంలోని రైతుల పొలాలన్నీ నీటమునిగాయి. దీంతో ఎస్సారెస్పీ అధికారులు జేసీబీతో వంతెనను తవ్వి పైపులను తొలగించడంతో నీరంతా కిందకు పోతున్నాయి. అయితే వంతెన ఆర్అండ్‌బీ పరిధిలో ఉండటంతో మరమ్మతు పనుల్లో జాప్యమేర్పడుతోందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెండు శాఖల అధికారులు సమన్వయంతో వంతెన మరమ్మతు పనులు పూర్తి చేసేలా తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పేర్లు

గతంలో పోలింగ్ కేంద్రాల్లో నియోజకవర్గం సంఖ్య, పోలింగ్ కేంద్రం సంఖ్య మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో వాటితోపాటు కొత్తగా పోలింగ్ కేంద్రానికి నియమితులైన బీఎల్‌వో, సూపర్‌వైజర్ల పేర్లతోపాటు సెల్‌ఫోన్ నెంబర్లు ఓటర్లకు కనిపించేలా గోడపై రాయించారు. కరీంనగర్ మండలంలోని 17గ్రామపంచాయతీల పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఈ సమాచారాన్ని ఏర్పాటు చేశారు.

– కరీంనగర్‌రూరల్



ఆయుష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆయుష్ ఉద్యోగులు

కరీంనగర్‌టౌన్: ధన్వంతరి జయంతి, 8వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ, విశ్వ ఆయుర్వేద పరిషత్ సహకారంతో ఉద్యోగులు, సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకుడు బి.రవినాయక్ మాట్లాడుతూ మల్టీజోన్–1లో 222 ఆయుష్ వెల్‌నెస్ సెంటర్లకు ఒక్కో దానికి రూ.6 లక్షల చొప్పున కేటాయించి యోగాషెడ్లు నిర్మించి, యోగా శిక్షకులను నియమిస్తూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్లు కృష్ణప్రసాద్, వీరారెడ్డి, ఆర్ఎంవోలు జ్యోతి, నవీన, ఆయుర్వేద, యునాని వైద్యాధికారులు సంజీవ్‌కుమార్, యత్రబ్‌సుల్తానా, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షులు డాక్టర్ దశరథనాయక్, ఆయుష్ వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ‘సాన్వి’ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మునీందర్, ప్రిన్సిపాల్ ప్రసాద్

కొత్తపల్లి: మహబూబ్‌నగర్‌లో ఈనెల 11వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రేకుర్తిలోని సాన్వి జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు దొంగల రాజకుమార్, మెరుగవేణి ప్రదీప్‌లు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎర్రంశెట్టి మునిందర్, ప్రిన్సిపాల్ సిరిపురం ప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. కళాశాల అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్, సీఎల్ ఆర్పీలు, సిబ్బంది

జమ్మికుంట: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం, దీపావళి పండుగ సందర్భంగా మట్టి దీపాలు ఉపయోగించాలని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధం, సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పండుగ రోజున మట్టి దీపాలు వెలిగించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మల్లీశ్వరి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ బావర్‌సింగ్, మధుసూదన్, ఈఈ శ్రీకాంత్, సీఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల, దేవేంద్ర, సరళ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు వీడ్కోలు



సన్మానిస్తున్న జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతిపై ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రాజరత్నం, తుమ్మ శ్రీనివాస్, పల్లెపాటి వేణుగోపాల్‌రావులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. హెచ్ఎం ఆనందం, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమీక్ష

కొత్తపల్లి: కరీంనగర్‌లోని విద్యుత్‌భవన్ ఆవరణలోని సమావేశ మందిరంలో శుక్రవారం కరీంనగర్‌రూరల్ డివిజన్, అల్గునూర్, నుస్తులాపూర్ సబ్‌డివిజన్ల పరిధిలోని వోఅండ్ఎం సిబ్బందితో కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వి.గంగాధర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డీఈ ఎం.తిరుపతి, ఎస్ఏవో రాజేశం, ఏడీఈలు శ్రీనివాస్, ప్రశాంత్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మంకమ్మతోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ టెస్టులు నిర్వహించి వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెన్నమాధవుని పవనసుత రాజు, బొంగోని దామోదర్, మేచినేని రాజేశ్వర్‌రావు, శంకరయ్య, ఉపసర్పంచ్ కాసు వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

మానకొండూర్‌రూరల్: మండలంలోని దేవంపల్లిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది డా.ఎంఎల్ఎన్ రెడ్డి, ఆర్గనైజర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన వంటశాల ప్రారంభం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయం(బొమ్మలగుడి)లో అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానం కార్యక్రమానికి ఆలయ ట్రస్టీ కొండూరి కుటుంబ సభ్యుల సహకారం, మహాలక్ష్మి ఐరన్‌అండ్‌హార్డ్‌వేర్ యాజమాని రామడుగు సునీత, రవీందర్‌రావు సౌజన్యంతో నూతన వంటశాలను నిర్మించారు. శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి వంటశాలను ప్రా రంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవాలయంలో నిత్యాన్నదానం వంటశాల ఏర్పాటు కోసం దాతలు ముందుకు వచ్చారని, ఇప్పుడు భక్తులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు వేణుగోపాలశర్మ, ఆలయ ట్రస్టీలు కొండూరి కుటుంబ సభ్యులు, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు, భవాని భజన సభ్యులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌రూరల్ మండలంలో శుక్రవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ముగ్గురు వ్యక్తుల వద్ద రూ.13వేలు విలువ గల 65 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కనకట్ల రవి, కుక్కల మల్లవ్వ, ఎలిగటి లచ్చయ్యలపై కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై శ్రీనివాస్, మోసిన్, ఖాసంబి, రవిలు పాల్గొన్నారని అన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువకులతో ఎస్సై

గంగాధర: పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని ఎస్సై వంశీకృష్ణ అభిలాష్ కానిస్టేబుల్‌గా ఎంపికైనవారికి సూచించారు. మండలంలో 34 మంది ఉద్యోగానికి ఎంపిక కాగా శుక్రవారం వారి సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చట్టాల అమలు, నేరా లను నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించడం, సహాయక సేవలు అందించే లక్షణాలు ఉండాలన్నారు. ప్రజలు, వారి ఆస్తులు రక్షించడం, చట్టాలను ఉల్లంఘించిన వారిని పట్టుకోవడంలో బాధ్యత ఉండాలన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించినవారిని అభినందించారు.